400 లక్షల కోట్లు దిగువకు..

క్షీణించిన బీఎస్ఈ సంస్థల విలువ

ముంబై, ఫిబ్రవరి 18: బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.400 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోతుండటం, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మదుపరుల్లో సెంటిమెంట్ నీరుగారింది. దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడంతో మంగళవారం రూ.2,01,032.5 కోట్లు కరిగిపోయి రూ.3,89,31,067.30 కోట్ల(4.58 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో తొలిసారిగా రూ.400 లక్షల కోట్ల మార్క్‌ను అధిగమించిన బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ 10 నెలల్లో ఈ మైలురాయిని కోల్పోవడం విశేషం. గతేడాది సెప్టెంబర్ 27న చారిత్రక గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన బీఎస్ఈ సెన్సెక్స్ ప్రస్తుతం 10,010.86 పాయింట్లు లేదా 11.64 శాతం వాటాను కోల్పోయింది.

సూచీలబీ అదేదారి

స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎఫ్ఐఐల పెట్టుబడులు ఉపసంహరణ, కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలతో మంగళవారం సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 29.47 పాయింట్లు నష్టపోయి 75,967.39 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 14.20 పాయింట్లు కోల్పోయి 22,945.30 వద్ద స్థిరపడింది. మార్కెట్లో ఇండస్‌ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఐటీసీ, టాటా మోటార్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టపోగా..ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, జొమాటో, పవర్‌గ్రిడ్, కొటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఇండస్ట్రియల్స్ 1.51 శాతం నష్టపోగా, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.19 శాతం, టెలికం 1.06 శాతం, క్యాపిటల్ గూడ్స్, వాహన రంగ షేర్లు నష్టపోయాయి. కానీ, యుటిలిటీ, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఎనర్జీ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

మంగళవారం న్యూఢిల్లీలో ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్థిక సేవల కార్యదర్శి నాగరాజు తదితరులు

ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) సంస్థ మంగళవారం ఓ సరి కొత్త ప్లాన్‌ను పరిచయం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు చేతులమీదుగా దీన్ని ఆవిష్కరించింది. ఇక ఇదో నాన్-లింక్డ్, వ్యక్తిగత/బృంద, పొదుపు, తక్షణ యాన్యుటీ ప్లాన్. సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ రకాల కోసం విస్తృత శ్రేణిలో యాన్యుటీ ఆప్షన్లను అందిస్తుంది. జీవించి ఉన్న పాలసీదారులకైనా, మరణించిన పాలసీదారుల నామినీలు, వారసులకైనా ప్లాన్ నిబంధనలకు లోబడి ఎంచుకున్నవిధంగా ఒకేసారి లేదా వాయిదా పద్ధతుల్లో చెల్లింపులుంటాయి. ఈ కార్యక్రమంలో ఆర్థిక సేవల విభాగం అదనపు కార్యదర్శి ఎంపీ తంగిరాల, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కుమార్ గోయల్‌లతోపాటు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతీ ఇతర మేనేజింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ పెన్షన్ ప్లాన్ ప్రత్యేకతలు

- సింగిల్ ప్రీమియం, తక్షణ యాన్యుటీ.
- కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా విస్తృత రీతిలో యాన్యుటీ ఆప్షన్లు.
- పాలసీదారుడి కనీస వయసు 18 ఏండ్లు. గరిష్ఠ వయసు యాన్యుటీ ఆప్షన్‌నుబట్టి 65 నుంచి 100 ఏండ్లు.
- సింగిల్ లైఫ్, జాయింట్ లైఫ్ యాన్యుటీ ఆప్షన్లను ఎంచుకునే వెసులుబాటు.
- ప్రస్తుత పాలసీదారులకు, చనిపోయిన పాలసీదారుల నామినీ లేదా వారసులకు యాన్యుటీ రేటు పెంపు ద్వారా ఆకర్షణీయ ప్రోత్సాహకాలు.
- పాలసీ నిబంధనలకు లోబడి పాక్షికంగానైనా లేదా పూర్తిస్థాయిలో నగదు ఉపసంహరించుకొనే సౌకర్యం.
- కనీస కొనుగోలు ధర లక్ష రూపాయలు. దీన్ని మించి ఎక్కువగా కొంటే ప్రోత్సాహకాలూ లభిస్తాయి.
- వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెలవారీ చెల్లింపులకు అవకాశం. వీటికి తగ్గట్టే యాన్యుటీ వాయిదాలుంటాయి.
- ప్రత్యేకంగా ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్లకు తక్షణ యాన్యుటీకి వెసులుబాటు.
- దివ్యాంగుల కోసం కూడా ప్రయోజన కర ఆప్షన్లు.
- www.licindia.in ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాన్‌ను కొనవచ్చు. ఎల్ఐసీ ఏజెంట్, ఇతర ఆఫ్‌లైన్ మార్గాల ద్వారా కూడా కొనవచ్చు.
- ప్లాన్ కొన్న 3 నెలల తర్వాత ఎప్పుడైనా పాలసీదారులు రుణ సదుపాయం తీసుకునే వీలుంటుంది.

టీవీఎస్ 2025 ఎడిషన్

రోనిన్ బైకు

ప్రారంభ ధర రూ.1.35 లక్షలు

చెన్నై, ఫిబ్రవరి 18: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్‌కు మరో వాహనాన్ని పరిచయం చేసింది. 2025 ఎడిషన్‌గా విడుదల చేసిన 225 సీసీ మోటర్‌సైకిల్ 'రోనిన్'లో భద్రత ఫీచర్లను అప్‌గ్రేడ్ చేసింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.1.35 లక్షలుగా నిర్ణయించింది. డ్యూయల్ చానెల్ ఏబీఎస్ రకం మాడల్ రూ.1.59 లక్షలు. ఈ ధరలు చెన్నై షోరూంనకు సంబంధించినవి. 225.9 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 20.4 పీఎస్‌ల శక్తి నివ్వనున్నది. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..ఈ బైకును యువతకు నచ్చే విధంగా డిజైన్ చేసినట్లు వెల్లడించింది. స్టైలిష్, రైడింగ్ పరంగా కొన్ని మార్పులు చేసినట్లు కంపెనీ పేర్కొన్నది. ఈ మాడల్‌తో సేల్స్ పెరుగు తాయన్న ఆశాభావాన్ని సంస్థ కనబరుస్తున్నది.

ఎన్ఎస్ఈ విలువ రూ.4.7 లక్షల కోట్లు

- **గత ఏడాది 201 శాతం వృద్ధి**

ముంబై, ఫిబ్రవరి 18: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) విలువ రూ.4.7 లక్షల కోట్లకు చేరిందని ఓ తాజా నివేదిక పేర్కొన్నది. దేశంలోని అతిపెద్ద ఈక్విటీ మార్కెట్ వేదికల్లో ఒకటైన ఎన్ఎస్ఈ.. త్వరలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారతీయ స్టాక్ మార్కెట్లలో నమోదైన, నమోదుకాని 500 భారీ సంస్థలతో బుర్గండి ప్రైవేట్ హురున్ ఇండియా 2024కు గాను ఓ జాబితాను తీసుకొచ్చింది. ఇందులో గత ఏడాది ఎన్ఎస్ఈ విలువ ఏకంగా 201 శాతం పుంజుకున్నట్లు తేలింది. ఇక దేశంలో అత్యంత విలువైన కంపెనీల్లో ఎన్ఎస్ఈ 10వ స్థానంలో ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఎన్ఎస్ఈ స్థూల ఆదాయం 28 శాతం పుంజుకొని రూ.16,352 కోట్లుగా నమోదైంది. పన్ను అనంతర లాభం 51 శాతం ఎగిసి రూ.8,306 కోట్లుగా ఉన్నది. కాగా, ఇటీవలే లిస్టింగ్ ప్రక్రియను మొదలుపెట్టిన ఎన్ఎస్ఈ.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీకి దరఖాస్తు చేసుకున్నది. పబ్లిక్ ఇష్యూలో 10 శాతం వాటాలను విక్రయించే వీలున్నట్టు అంచనా.

రిలయన్స్ టాప్

రూ.17.5 లక్షల కోట్ల విలువతో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) హురున్ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది. రూ.16.1 లక్షల కోట్లతో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రెండో స్థానంలో ఉండగా, 30 శాతం వృద్ధిని సాధించినట్టు హురున్ పేర్కొన్నది. గ్రూపులవారీగా చూస్తే.. టాటా గ్రూప్ విలువ 37 శాతం వృద్ధితో రూ.32.27 లక్షల కోట్లుగా ఉన్నది. రిలయన్స్ గ్రూప్ రూ.19.71 లక్షల కోట్లుగా ఉంటే.. గౌతమ్ అదానీ గ్రూప్ విలువ రూ.13.40 లక్షల కోట్లుగా తేలింది. ఇక ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న 500 కంపెనీల్లో ప్రతీదాని విలువ బిలియన్ డాలర్లపైనే. ఈ మొత్తం కంపెనీల వాల్యూ కూడా 3.8 ట్రిలియన్ డాలర్లను తాకింది. రెవిన్యూ ట్రిలియన్ డాలర్లుగా ఉంటే.. లాభం రూ.8 లక్షల కోట్లుగా ఉన్నది. పన్నులు రూ.2.2 లక్షల కోట్లుగా ఉండగా.. ఉద్యోగులు 85 లక్షల మంది ఉన్నారు.

క్యూ3 జీడీపీ 6.4%!: ఇక్రా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో దేశ జీడీపీ వృద్ధి రేటు 6.4 శాతంగా నమోదు కావచ్చని భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 6.7 శాతంగా ఉంటే.. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో ఏకంగా ఏడు త్రైమాసికాల కనిష్ఠాన్ని తాకుతూ 5.4 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే. ఇందుకు మార్కెట్‌లో డిమాండ్ బలహీనపడటం, కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం తగ్గిపోవడం కారణంగా పేర్కొన్న ఇక్రా.. ప్రస్తుతం ఈ రెండు అంశాల్లో పరిస్థితులు మెరుగయ్యాయని అంటున్నది. అందుకే వృద్ధిరేటు అంచనా 6.4 శాతంగా నమోదు కావచ్చని చెప్పింది. కాగా, ఈ నెల 28న అక్టోబర్-డిసెంబర్ త్రైమాసిక జీడీపీ వృద్ధి గణాంకాలను ఎన్ఎస్ఓ అధికారికంగా ప్రకటించనున్నది. కాగా, ఆర్బీఐ వృద్ధి అంచనా ఈసారికి 6.6 శాతంగా ఉన్నది.

స్టార్టప్‌లకు బ్రెజిల్ దన్ను

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నది. దేశీయ స్టార్టప్‌లకు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలనే ఉద్దేశంతో టీహబ్..బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో టీ హబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రటరీ జోస్ ప్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు ఇక్కడ అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా కృత్రిమ మేధస్సు, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ తదితర రంగాల్లో పరస్పర సహకారం ఉంటుందని వారు వివరించారు.

టెస్లా ఇండియాలో నియామకాలు షురూ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశీయ మార్కెట్లోకి అడుగుపెట్టాలని ఇప్పటికే ప్రయత్నాలు వేగవంతం చేసిన అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా..తాజాగా ఉద్యోగ నియామకాలను ప్రారంభించింది. అతి త్వరలో తన తొలి షోరూంను ప్రారంభించబోతున్న సంస్థ అందుకుతగ్గట్టుగా రిక్రూట్‌మెంట్లను ఆరంభించింది. తన తొలి షోరూంను ముంబైలో ప్రారంభించబోతున్నట్లు తెలుస్తున్నది. నూతన ఉద్యోగాల్లో సర్వీస్ అడ్వయిజర్లు, సర్వీస్ మేనేజర్లు, స్టోర్ మేనేజర్లు ఉన్నారు.

కజారియా నయా సెంటర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18: దేశంలో అతిపెద్ద సిరామిక్ అండ్ విట్రిఫైడ్ టైల్ తయారీ సంస్థ కజారియా..హైదరాబాద్‌లో అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ అన్ని రకాల టైల్స్ లభించనున్నాయని కంపెనీ ఎండీ రిషీ కజారియా తెలిపారు. టైల్స్, బాత్, శానిటరీవేర్ ఉత్పత్తులను ప్రతీ కుటుంబానికి అందించడం లక్ష్యంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వంగరలో కలెక్టర్ హాస్టల్ నిద్ర

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 18: మండలంలోని వంగరలో పీవీ రంగారావు బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం రాత్రి కలెక్టర్ ప్రావీణ్య హాస్టల్ నిద్ర చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లోని డార్మెటరీ, తరగతి, వంట గదులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. హాస్టల్‌లో విద్యార్థుల భోజనంపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల, కళాశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపాల్ ఆఫ్రిన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రాత్రి వండిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల, కళాశాలలో రూ. 24లక్షలతో చేపట్టిన వివిధ కార్యక్రమాలను పరిశీలించానన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పదిరోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 109 గురుకుల పాఠశాలలు ఉన్నాయని, వాటి పర్యవేక్షణకు జిల్లాస్థాయి అధికారులను నియమించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసి బస చేశారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో వీరేశం, ఎంఈవో సునీతారాణి, పీఆర్ ఏఈ వినయ్ పాల్గొన్నారు.

'ఆర్టీవో'లో ఆరు గంటలు కరెంట్ నిలిపివేత

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రవాణా శాఖాధికారి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 18 : మహబూబాబాద్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం సుమారు ఆరు గంటల పాటు విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ నిలిపివేశారు. ఆఫీస్ సిబ్బంది యూపీఎస్ పవర్ ద్వారా సేవలు వినియోగించుకున్నారు. దీంతో సంబంధిత ఏఈకి ఫోన్ చేసి అడిగితే మీ ఆఫీస్‌లో పెండింగ్ బిల్ రూ. 65 వేలు ఉందని, అందుకు కరెంట్ కట్ చేసినట్లు పేర్కొన్నారు. వెంటనే ఆర్టీవో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరాను అందించినట్లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ సెంటర్‌లో ఆర్టీవో అధికారులు వాహనాలను చెక్ చేస్తుండగా కరెంట్‌కు సంబంధిత ఓ కాంట్రాక్టర్ వెహికిల్ పట్టుకుని సీజ్ చేశారని, దానిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులకు బిల్లు కట్ట లేదని సాకు చూపించి కరెంట్ కట్ చేసినట్లు సమాచారం.

పలుగుల అడవుల్లో పులి సంచారం..



పులి పాదముద్రలు

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 18 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ పూర్ మండలంలోని పలుగుల గ్రామ శివారు అడవుల్లో పులి సంచారం కలకలం రేపుతున్నది. గత నాలుగు రోజులుగా మండలంలోని అన్నారం, బీర సాగర్ అడవుల్లో పులి సంచరిస్తున్నదన్న సమాచారంతో అలర్ట్ అయిన అటవీశాఖ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి అన్వేషిస్తున్నారు. మంగళవారం పలుగుల గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ క్షేత్రానికి ఎండ్లబండిలో వెళ్తున్న క్రమంలో పులిని చూసి భయంతో పరుగులు తీశాడు. విషయాన్ని గ్రామస్తులు, అధికారులకు తెలుపగా సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు పులి జాడ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అటవీ క్షేత్రంలో పులి పాదముద్రలు గుర్తించిన అధికారులు సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. గొర్ల కాపరులు, ప్రజలు అడువుల్లోకి వెళ్లొదని సూచించారు. పులి ఆనవాళ్లను గుర్తిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఎఫ్ఆర్‌వో రవి తెలిపారు. కాగా, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పులి సంచారంతో భయాందోళనకు గురవుతున్నారు.

టీఆర్ల జారీలో ఎవరి పాత్ర ఎంత?

- **వివరాలు సేకరిస్తున్న మార్కెటింగ్ శాఖ**
- **నోటీసులకు కార్యదర్శులు సమాధానం ఇచ్చిన తర్వాతే విచారణ**
- **వ్యవసాయ అధికారులు, డీఈవోలపై ఆరా**
- **మరికొందరిపై వేటుకు సిద్ధం**
- **మార్కెట్ ఉద్యోగుల్లో గుబులు**

కాశీబుగ్గ, ఫిబ్రవరి 18: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్ల కోసం జారీ చేసిన టీఆర్ (టెంపరరీ రిజిస్ట్రేషన్)లో ఎవరి పాత్ర ఎంత ఉందనే విషయంలో మార్కెటింగ్ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. టీఆర్ల జారీలో పెద్ద మొత్తంలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఇప్పటికే ఏడుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. వ్యవసాయ అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను పత్తి కొనుగోళ్ల సమయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, మార్కెట్ కమిటీ కార్యదర్శి వాటిని ఆమోదించారు. తప్పు చేసింది వ్యవసాయ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు అయితే మార్కెట్ కార్యదర్శులను బలి చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఇచ్చిన నోటీసులకు సంబంధిత కార్యదర్శులు 15 రోజుల్లో జవాబు ఇస్తే వారు ఇచ్చే సమాధానాన్ని బట్టి విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ వ్యవహారంపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ డిపార్ట్‌మెంట్ వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. వీరి విచారణలో వ్యవసాయ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు మరికొంతమంది మార్కెట్ కార్యదర్శులు, ఇతర సిబ్బంది వ్యవహారం బహిర్గతం అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తున్నది.

వ్యవసాయ అధికారుల చేతివాటం

టీఆర్ల జారీలో కొంత మంది వ్యవసాయ అధికారులు డబ్బులు తీసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేనిది ఉన్నట్లు, ఎక్కువ భూమి నమోదు చేయడం, వ్యవసాయం చేయకున్నా చేసినట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. ఆమ్యామ్యాలకు పాల్పడిన డాటా ఎంట్రీ ఆపరేటర్లు(డీఈవోలు) ఆన్‌లైన్‌లో ఎక్కువ భూమిని నమోదు చేసినట్లు తెలిసింది. వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే టీఆర్‌లు జారీ చేయాలని స్పష్టంగా నిబంధనలు ఉన్నా కొంతమంది ఇష్టం వచ్చినట్లు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరికొందరు అయితే డూప్లికేట్ టీఆర్‌లను ప్రింటింగ్ చేయించి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని జారీ చేసినట్లు తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ పత్తి కొనుగోలు చేయగా సుమారు 50వేలకు పైగా టీఆర్‌లు జారీ కాగా, మొదటి విడుతగా ఏడుగురిని సస్పెండ్ చేయగా మరో 15 మందికి రెండో విడుతలో వేటు పడే అవకాశం ఉన్నట్లు ప్రచారం అవుతున్నది.

ఎంజీఎంలో స్కానింగ్ కష్టాలు

- **ఉన్న సిబ్బంది తొలగింపు**
- **రోగులకు ఆలస్యమవుతున్న సేవలు**
- **రేడియాలజీ సిబ్బందిపై పెరుగుతున్న పనిభారం**
- **పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు**

ఎంజీఎం క్యాజువాలిటీ విభాగానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ యంత్ర విభాగం

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 18: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎంజీఎం దవాఖానలో ఉన్న సిబ్బందిని తొలగించి, కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలకు ఆటంకం కలిగిస్తున్నది. ఆస్ప త్రిలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉన్నా టెక్నీషియన్లను తొలగించడంతో సత్వర సేవలందక రోగులు, పనిభారం పెరిగి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు, ప్రభుత్వానికి పట్టింపులేదు. వరంగల్ నగరాన్ని హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల వ్యయంతో గత కేసీఆర్ ప్రభుత్వం అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా 2022 మే 24న కంప్యూటరైజ్డ్ టొమోగ్రఫీ (సీటీ) స్కానింగ్ యంత్రాన్ని క్యాజువాలిటీ విభాగానికి అనుసంధానంగా ఏర్పాటు చేసింది. అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయా కర్‌రావు చేతుల మీదుగా యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం నిరాటంకంగా సేవలు అందించారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టెక్నీషియన్లను తొలగించి సేవలను దూరం చేస్తున్నది. మెడాల్ సంస్థ ద్వారా సేవలు అందించిన ఉద్యోగులను యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవకులుగా కొనసాగిస్తున్న ప్రభుత్వం ఏడాదిగా వారికి వేతనాలు చెల్లించడం లేదు. వేతనాలు చెల్లించడానికి ఆరోగ్యశ్రీ నుంచి వచ్చే నిధులు సరిపోవడం లేదంటూ 14 మంది సిబ్బందిని తొలగించారు. దీంతో స్కానింగ్ సేవలకు ఇబ్బందులు తలెత్తడంతో సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో విధులు నిర్వర్తిస్తున్న టెక్నీషియన్స్ తోపాటు ఎంజీఎం రేడియాలజీ విభాగంలో సేవలు అందిస్తున్న సిబ్బంది ఇక్కడ తాత్కాలికంగా సేవలు అందించాలని ఆదేశించారు. దీంతో అటు సూపర్ స్పెషా లిటీ హాస్పిటల్‌లో ఇటు ఎంజీఎంలోని 92 రేడియాలజీ విభాగంలో అవసరానికి తగినంత సిబ్బంది అందుబాటులో లేకుండాపోయారు. ఎంజీఎం దవాఖాన క్యాజువాలిటీ విభాగానికి అనుసంధానంగా ఉన్న సిటీ స్కాన్ యంత్రాన్ని ఉప యోగించి నిత్యం వంద కొత్త కేసుల తోపాటు రిపీట్ కేసులు సుమారు 20 వరకు ఉంటాయి. నిత్యం 120 కేసుల స్కానింగ్‌లు తీయడం వల్ల సిబ్బంది సైతం తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని కొందరు వైద్యులు చెబుతున్నారు. స్కానింగ్‌లు ఆలస్యం కావడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

టెక్నాలజీని రైతులకు అందించాలి

- **జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జానయ్య**
- **వరంగల్ ఆర్ఏఆర్ఎస్‌లో అగ్రి హబ్ రూరల్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభం**

మాట్లాడుతున్న జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ జానయ్య

హనుమకొండ సబర్బన్, ఫిబ్రవరి18: ప్రస్తుతం వ్యవసాయ రంగం సంక్షోభంలో లేదని రైతులు మాత్రం ఉన్నారని, వారు విజయం సాధించాలంటే వారికి మెరుగైన టెక్నాలజిని అందించే విషయంలో యువత ముందుకు రావాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య అన్నారు. మంగళవారం వరంగల్ ప్రాంతీయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్)లో ఏర్పాటు చేసిన అగ్రిహబ్ రూరల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ ఇలాంటి స్టార్టప్‌లను వినియోగించుకుని యువ రైతులు వ్యవసాయంలో అద్భుతాలను సృష్టించాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి వ్యవసాయ యూనివర్సిటీ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ ఆవిష్కరణలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. యువతలో వ్యవసాయానికి తోడ్పడే ఆలోచనలను అభివృద్ధి చేసి వాణిజ్యపరంగా మార్చి అంకుర సంస్థలుగా ఏర్పాటు చేసేందుకు ఈ స్టార్టప్‌లు ఉపయోగపడతాయని చెప్పారు. ఏడీఆర్ ఉమ్మారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు ఉపయోగపడే అనేక కొత్త మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం, అగ్రిహబ